సమస్యల స్వాగతం

- బాధ్యతలు స్వీకరించిన బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ రమేశ్
- బల్దియా అభివృద్ధిపై స్థానికుల్లో ఆశలు



గుంతలుపడి నీరునిలిచిన కన్నాలబస్తీకి వెళ్లే రోడ్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్‌గా తన్నీరు రమేశ్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బల్దియా పగ్గాలు చేతపట్టిన కమిషనర్‌కు అనేక అంశాలు సవాల్ విసురుతుండగా, పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వీటి పరిష్కారంలో కొత్త కమిషనర్ చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏళ్ల తరబడి నుంచి మున్సిపల్ సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుండగా చిత్తశుద్ధితో పరిష్కరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఓర్పు, నేర్పుతో సవాళ్లను అధిగమిస్తూ, సమస్యలను ఛేదిస్తూ ముందుకు సాగాల్సి ఉంది. ప్రస్తుతం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌పై పురప్రజలు పుట్టెడు ఆశలు పెట్టుకున్నారు. ఏళ్ల నుంచి సమస్యలతో సతమతమవుతున్న పురప్రజలను బయట పడేయడానికి కొత్త కమిషనర్ ఎంతమేరకు పట్టుదలతో పాటుపడతారనేది చూడాల్సి ఉంది.

సమస్యలు కోకొల్లలు..

- మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా వీటి పరిధిలో ఉన్న అంతర్గత రోడ్లు, మురుగు నీటి కాలువలు చెదిరిపోయి గుంతలు పడి అధ్వాన్నంగా తయారయ్యాయి. వీటి పునఃనిర్మాణం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.
- అంబేడ్కర్ (కాంటా) చౌరస్తా వద్ద నుంచి పాత బస్టాండ్ వరకు బైక్‌లకు పార్కింగ్ స్థలంలేకపోవడంతో రోడ్డు పుట్‌పాత్‌పై, షాపుల ఎదుట నిలుపుతున్నారు. అదే తీరుగా ఆటో రిక్షాల పార్కింగ్ స్థలాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. వీటిని కాపాడి బైక్‌ల కోసం పార్కింగ్ స్థలాలను ఎంపిక చేయాలి.
- మున్సిపాలిటీలో నిర్మించిన చౌరస్తాల ఆధునీకరణ లేకుండా పోగా, ప్రధాన రహదారి విస్తరణ పనులు పడకేశాయి. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్డు విస్తరించడానికి చర్యలు తీసుకోవాలి.
- పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ నగర్ వరకు, కాంటా చౌరస్తా నుంచి పోశమ్మ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు పనులు ఆలస్యం చేయకుండా ప్రారంభించాలి.
- మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. వెంటనే ఆ పనులు పూర్తి చేసి దరఖాస్తు దారులకు నల్లా కనెక్షన్లు జాప్యం చేయకుండా ఇవ్వాలి.
- ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి రూ.60కోట్లతో చేపట్టిన అమృత్ 2.0గోదారి నీటి పథకాన్ని త్వరగా పూర్తి చేయించి, పుర ప్రజలకు గోదారి జలాలు అందించాలి.
- కూరగాయల మార్కెట్లో షెట్టర్ల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలు సరిచేసి అర్హులకు దక్కేలా పారదర్శకంగా వ్యవహరించాలి. మటన్, చికెన్, ఫిష్ మార్కెట్ల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.
- పుర ప్రజలు, చిన్నారుల కోసం పార్కులు ఏర్పా టు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. పిల్లల కు ఆట వస్తువులు అందు బాటులో ఉంచాలి.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ రమేశ్

- మున్సిపల్‌వ్యాప్తంగా వీధి దీపాలు ఏర్పాటు చేయించి, రోజువారీగా సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలి.
- అక్రమాలకు తావు లేకుండా కొత్తగా నిర్మిస్తున్న పక్కా గృహాలకు ఇంటి నంబర్లు మంజూరు చేయాలి. ఈ విషయంలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలి.

సవాళ్లను అధిగమిస్తేనే అభివృద్ధి..

మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను క్రమ పద్ధతిలో పరిష్కరించడానికి పాటుపడితే కానీ అభివృద్ధి జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. మున్సిపల్ ఏ ఒక వార్డులోనూ అభివృద్ధి ఛాయలు కనిపించని పరిస్థితులు ఉన్నాయి. బొగ్గు గనుల క్షేత్రమైన బెల్లంపల్లిని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి కంకణబద్ధులు కావాల్సి ఉంది. ఆ దిశగా కొత్త కమిషనర్ అడుగులు వేస్తారని పుర ప్రజలు ఆశిస్తున్నారు.

మున్సిపల్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న కొటాంవాడ మహిళలు

చెన్నూర్: మున్సిపల్ అధికారులకు పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లేదని, పక్షం రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెన్నూర్ 11వ వార్డు పరిధిలోని కొటాంవాడ మహిళలు ఆరోపించారు. మున్సిపల్ అధికారుల తీరుకు నిరసనగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మహిళలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో కాలనీలో ఉన్న మోటర్ ద్వారా నీరు సరఫరా అవుతుందన్నారు. మోటర్ చెడిపోయి పక్షం రోజులవుతున్నా అధికారులు బాగు చేయించడం లేదన్నారు. నీళ్లు లేక డబ్బులు పెట్టుకొని ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపన పోలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాలనీ వాసులకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొటాంవాడ మహిళలు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించరూ..!

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి అధ్వాన్నంగా తయారయ్యింది. సంబంధిత అధికారులు పట్టించుకొని పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



29న ఆర్‌కేపీలో ఉచిత మెగా వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రామకృష్ణాపూర్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మంచిర్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మునీర్ స్మారకార్థం ఈ నెల 29న రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి క్లబ్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ నిర్వాహకులు, మాజీ కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, రెనీ ఆసుపత్రి జీఎం పవన్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక ఆర్కేసీఓఏ క్లబ్‌లో గురువారం క్యాంప్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కరీంనగర్‌లోని రెనీ హాస్పిటల్, మంచిర్యాల మెడిలైఫ్ ఆసుపత్రి సహకారంతో 29న నిర్వహించే ఈ క్యాంప్‌లో ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్, కార్డియాలజీ, న్యూరాలజీ తదితర అన్ని రకాల వైద్య పరీక్షలు స్పెషలిస్ట్ వైద్యులతో ఉచితంగా నిర్వహించనున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

శ్రీరాంపూర్: ప్రతీ అధికారి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నైవేలీ లిగ్నైట్ సంస్థ మాజీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి తెలిపారు. సీసీసీలోని సింగరేణి గెస్టుహౌస్ కాన్ఫరెన్సు హాల్లో గురువారం బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని అధికారులకు లీడర్షిప్ క్వాలిటీస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. విషయ పరిజ్ఞానం ఎంత ఉన్నా, దాన్ని వ్యక్తపర్చడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, బెల్లంపల్లి జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, మందమర్రి జీఎం దేవేందర్, ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, బెల్లంపల్లి ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, అన్ని గనుల మేనేజర్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణం తిలక్‌నగర్‌లోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు అశోక్ కుమార్, రాము, రజితలు వైద్య పరీక్షలు చేసి, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. 150మందికి పైగా రోగులు పరీక్ష చేయించుకున్నారు. 45మంది అనుమానితుల నుంచి తెమడ నమూనాలు సేకరించి, ఎక్స్‌రే కోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, టీబీ ప్రోగ్రాం మేనేజర్ సురేందర్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత, సీవో అపర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాపత్యా క్రీడా సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



సభ్యులను సన్మానిస్తూ...

మంచిర్యాలటౌన్: జిల్లా అత్యాపత్యా క్రీడా సంఘం జిల్లా కమిటీని గురువారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గాండ్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా పెద్దపెల్లి ఉప్పలయ్య, కోశాధికారిగా దొంతుల వర్ధా, ఉపాధ్యక్షుడిగా కనపర్తి రమేశ్, గాంధర్ల సంతోష్, కే.దేవేందర్, డి.రాజలింగు, సంయుక్త కార్యదర్శులుగా పి.విశాల, ఎస్.సౌందర్య, ఏ.రమేశ్, రామకృష్ణ నాయక్, కార్యవర్గ సభ్యులుగా కే.శ్రీనివాస్, డి.రాజేశ్, కే.రవి, గట్టు కుమార్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వినయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జిల్లా ఒలింపిక్ సంఘం పరిశీలకునిగా కనపర్తి రమేశ్, ఎన్నికల అధికారిగా అలుగువెల్లి రమేశ్‌రెడ్డి వ్యవహరించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కుమ్మరి స్వప్న భవనంపై దూకిన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో గురువారం గురుకుల జోనల్ ఆఫీసర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉన్న అనుమానాలు తొలిగించేలా చూడాలని జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ, టీవీయూవీ కార్యదర్శి శ్రీనివాస్, సాగర్ డిమాండ్ చేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



బెల్లంపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



చెన్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



నెన్నెలలో...

భీమారం/బెల్లంపలి/చెన్నూర్/నెన్నెల/శ్రీరాంపూర్/జన్నారం/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కాసమల సాయికిరణ్ అన్నారు. లక్సెట్టిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, నష్టాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. జన్నారంలో ఎస్సై గొల్లపెల్లి అనూష ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్ ఆధ్వర్యంలో కార్మిక వాడల నుంచి శ్రీరాంపూర్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఎస్‌ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల, ఎస్‌ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలల్లో ఆర్ట్, పెయింటింగ్, స్లోగన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలతో కలిసి ఎస్సై స్వరూప్‌రాజ్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. నెన్నెల ఉన్నత పాఠశాలలో ఎస్సై ప్రసాద్ గంజాయి, డ్రగ్స్ మత్తు పానియాల వల్ల కలిగే అనర్థాల గూర్చి వివరించారు. చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దిన్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై ర్యాలీ నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు.



జన్నారం: ర్యాలీలో పాల్గొన్న ఎస్సై అనూష



భీమారం: ర్యాలీలో పాల్గొన్న ఎస్సై శ్వేత



శ్రీరాంపూర్: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



బహుమతి అందజేస్తున్న ఎస్సై స్వరూప్‌రాజ్



లక్సెట్టిపేట: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే మన లక్ష్యం

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

తాండూర్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే అందరి లక్ష్యం కావాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తాండూర్ మండల కేంద్రంలో, మందమర్రి పట్టణం సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసులు, నాయకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో తాండూర్ సీఐ కుమారస్వామి, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఏరియా జీఎం దేవేందర్, తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.



తాండూర్: ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీపీ, అధికారులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

దండేపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి తెలిపారు. దండేపల్లి మండలంలో రాష్ట్రీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రదేశాలను ఆర్‌అండ్‌బీ డీఈ జగదీష్, ఏఈ సునీల్, ఎస్సై తహసినోద్దీన్‌లతో కలిసి గురువారం పరిశీలించారు. క్రాసింగ్‌లు, కూడళ్లు, వాటి వద్ద ప్రమాదాల నివారణకు తీసుకునే చర్యల గురించి చర్చించారు. రోడ్డుపై మార్కింగ్‌లతో పాటు, వీలైతే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

జన్నారం: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలో ప్రమాదాలు జరిగే స్థలాలను ఆర్‌అండ్‌బీ డీఈ జగదీశ్వర్, ఏఈ దేవి సునిల్, ఎస్సై గొల్లపెల్లి అనూష గురువారం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకునే చర్యలపై చర్చించారు.

సంక్షిప్త వార్తలు

• పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: ఈ నెల 29, 30వ తేదీల్లో హన్మకొండలో నిర్వహించే తెలంగాణ ప్రజాఫ్రంట్ నాలుగో రాష్ట్ర మహాసభల పోస్టర్లను మండలంలోని నాయకులు గురువారం వెంకట్రావుపేటలో ఆవిష్కరించారు. రాష్ట్ర మహాసభలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి బండారి ఆనంద్, నాయకులు పాల్‌సింగ్, బండారి స్వామి, భోగ పోశం, సంతోష్ పాల్గొన్నారు.

• నూతన కార్యవర్గం

జన్నారం: మండల టెంట్‌హౌజ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పర్ల శంకర్, గౌరవ అధ్యక్షులుగా, మెంగని సదన్న, ప్రధాన కార్యదర్శిగా ముంజంపల్లి సాయి కుమార్, కోశాధికారిగా, నిమిషకవి రాజేందర్, ఉపాధ్యక్షులుగా కందుల రాజేందర్, సామల్ల లక్ష్మీరాజం, ప్రచార కార్యదర్శులుగా సంగ అంజిత్, తాటి రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

• నియామకం

పాతమంచిర్యాల: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ సంస్థకు రక్తదాన, అవయవదాన ప్రతినిధిగా లయన్స్ క్లబ్ సభ్యుడు వి.మధుసూధన్ రెడ్డిని నియమించినట్లు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సింహరాజు కోదండరాం తెలిపారు. ఈ నియామకం 2025 జూలై నుంచి 2026వరకు మధుసూదన్ పదవిలో కొనసాగుతారన్నారు.

• చెట్లపొదల తొలగింపు

దండేపల్లి: మండలంలోని మాకులపేట శివారులో గల అటవీ భూమిలో లింగాపూర్‌కు చెందిన కొందరు గురువారం చెట్ల పొదలు తొలగించారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడకు చేరుకున్నారు. కొంతమందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. అటవీ భూమిలో చెట్లు, చెట్ల పొదలు తొలగించవద్దని సూచించినట్లు పేర్కొన్నారు.

• నష్టం జరగకుండా మత్తడి నిర్మించాలి

చెన్నూర్: శనిగకుంట మత్తడి నిర్మాణంలో అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, దొమకొండ అనిల్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు మత్తడి నిర్మాణం పనులను గురువారం సందర్శించారు. గతేడాది సెప్టెంబర్ మాసంలో మత్తడిని పేల్చేస్తే, తొమ్మిది నెలల తర్వాత అధికారులు మత్తడి నిర్మిస్తున్నారని తెలిపారు. వేసవి కాలంలో నిర్మిస్తే రైతులకు మేలు జరిగేదన్నారు. మత్తడి ఎత్తు తగ్గిస్తే మత్స్యకారులకు, రైతులకు నష్టం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేపడితే రైతుల పక్షాన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతి సురేశ్, వడ్లకొండ రవి, బొగె భారతి పాల్గొన్నారు.

• సాహు మహరాజ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

పాతమంచిర్యాల: బీసీ వర్గాల ప్రజల ఆకాంక్షల సాధన కోసం పాటు పడిన సాహు మహరాజ్ స్ఫూర్తిని చాటాలని బీసీ సంఘాల నేతలు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో గురువారం బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఛత్రపతి సాహు మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

• నరేంద్ర మోదీ సుపరిపాలనపై అవగాహన

మంచిర్యాలటౌన్: దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ 11ఏళ్ల సుపరిపాలనపై గురువారం జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో స్వామి వివేకానంద విగ్రహం వద్ద బీజేపీ గర్మిళ్ల జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజుకుమార్ ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు.

• ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కాసిపేట: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 7న అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య కోరారు. కాసిపేటలో గురువారం ఎమ్మార్పీఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, గ్రామ గ్రామాన జెండా ఎగుర వేసి నిర్వహించాలన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 4వ విడుత ఉపాధి హామీ సామాజిక ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. ఉపాధిహామీ కూలీలు, లబ్ధిదారులు ఉదయం 10గంటలకు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న కామ్రేడ్స్

బెల్లంపల్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ పథకాలు దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు అనంతరం రెండోసారి జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌ను పూలమాల వేసి శాలువాతో కామ్రేడ్స్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎం.వెంకటస్వామి, బి.పూర్ణిమ, జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి జాతర షురూ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల జాతర ప్రారంభమైంది. మొదటి రోజు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

హామీలు నెరవేర్చాలి

రామకృష్ణాపూర్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజరమేశ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. క్యాతనపల్లిలో బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు తాము చేసినట్టుగా కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవటం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో నాయకులు కంభగోని సుదర్శన్‌గౌడ్, రామిడికుమార్, బడికల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం(ఆర్‌డీ)కి సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి కార్పొరేట్ జీఎం(ఆర్‌డీ) ఆర్. నారాయణ రావును గురువారం జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులు, జీఎం శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. రిటైర్మెంట్ తరువాత శేషజీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలోఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్లు కుర్మ రాజేందర్, ఏవీ రెడ్డి, రవికుమార్, ఓసీపీ పీఓలు ఏవీ రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

బెల్లంపల్లి: లేబర్ కోడ్‌ల రద్దు కోసం జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఐసీడీఎస్ శ్రేణులు భాగస్వాములు కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ కోరారు. బెల్లంపల్లి సీఐటీయూ కార్యాలయంలో గురువారం సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. దేశవ్యాప్త సమ్మెను విజయ వంతం చేసి కార్మికుల సత్తాను ఎలుగెత్తి చాటాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ బెల్లంపల్లి మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్, ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, అనురాధ, రాధాభాయి, శంకరమ్మ, విజయలక్ష్మి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

జూలై 2న ఆర్యవైశ్య సంఘ ఎన్నికలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను జూలై 2న మంచిర్యాల ఆర్యవైశ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 2న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు నామినేషన్లు స్వీకరించి, 3న ఉదయం 10నుంచి 12గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 6న ఉదయం 10గంటల నుంచి 1గంటల వరకు పోలింగ్ నిర్వహించి, సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. ఓటింగ్‌లో పాల్గొనే వారు ఆర్యవైశ్య మహాసభలో సభ్యత్వం ఉండాలని, లేని వారికి జూలై 1 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

వసతుల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు నీల్వాయి, గొర్లపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని, స్నానపు గదులు, టాయిలెట్లు సక్రమంగా లేవన్నారు. నీల్వాయి హైస్కూల్‌లో 177మంది విద్యార్థులు ఉండగా, బాత్రూంల వద్ద ఇబ్బంది పడుతున్నారన్నారు. ఫిల్టర్ వాటర్ లేకపోవడంతో గుడి వద్ద నీటిని తెచ్చుకొని తాగుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.